


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ - సంక్షేమమే మా ధ్యేయం

| బుధవారం 09 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 99 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## అంగన్‌వాడీ పోస్టుల తాత్కాలిక జాబితా విడుదల.. అభ్యంతరాలకు మూడు రోజుల గడువు

సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లా పరిధిలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖాధికారి కె. నరసింహరావు తెలిపారు. పరిశీలన అనంతరం అర్హులు, అనర్హులుగా గుర్తించిన అభ్యర్థుల తాత్కాలిక జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీ పరిధిలోని వార్డు కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక జాబితాపై అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రకటన వెలువడిన తేదీ నుంచి మూడు రోజుల్లోగా, అంటే సెప్టెంబర్ 9 నుంచి సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు అభివృద్ధి పథకాధికారి (సీడీపీఓ) కార్యాలయంలో రాతపూర్వకంగా, అందుకు సంబంధించిన ఆధారాలు, పత్రాలతో సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువు ముగిసిన అనంతరం అందే అభ్యంతరాలను స్వీకరించబోమని జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖాధికారి కె. నరసింహరావు స్పష్టం చేశారు. తాత్కాలిక జాబితాలను అభ్యర్థులు సంబంధిత నోటీసు బోర్డుల్లో పరిశీలించుకుని, అవసరమైతే నిర్ణీత గడువులోపు అభ్యంతరాలను సమర్పించాలని అధికారులు సూచించారు.



## అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం

సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు. సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవసేన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని, ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని, క్షేత్రస్థాయిలో ప్రజలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా తెలుసుకుని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చని, చిన్న సమస్య అయినా నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాల్లో అవసరమైన ధ్రువపత్రాన్ని ఓటర్లు సమర్పించాల్సి ఉంటుందని, అధికారులు తమ స్థాయిలో ధ్రువపత్రాల సమర్పణ నుంచి మినహాయింపు ఇవ్వలేరని పేర్కొన్నారు. వివాహిత మహిళల పేర్ల మార్పులు, పేర్లలో అక్షర దోషాలు, ఇతర చిన్నపాటి క్లరికల్ తప్పిదాలను స్వీయ ప్రకటన ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని వివరించారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధ్రువపత్రాలపై రాజకీయ పార్టీలు అవగాహన కల్పించి, విచారణకు హాజరయ్యే సమయానికి సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా సహకరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రేషనలైజేషన్ అనంతరం జిల్లాలో 1,212 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి బీఎల్ఓను నియమించామని, 4,286 మంది బీఎల్ఏలు ఉన్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 10,08,252 మంది ఓటర్లు ఉండగా, 9,11,945 ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మహిళా–పురుష ఓటర్ల నిష్పత్తి 50.97గా ఉందని, 7,457 మంది సీనియర్ సిటిజన్లు, 15,189 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, ఓటరు జాబితాలో చిరునామా, వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఉన్న 1,94,106 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామని, ప్రస్తుతం విచారణ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. నోటీసుల జారీ, విచారణపై ఈ నెల 5, 6 తేదీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాల ద్వారా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ, ఓటర్ల జాబితాలోని 'నో మ్యాపింగ్' కేసులకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా అందిస్తున్నామని, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. పేర్లలో తప్పులు, ఇతర క్లరికల్ పొరపాట్లు, వివాహిత మహిళల పేర్ల మార్పులను బీఎల్ఓకు స్వీయ ప్రకటన సమర్పించడం ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సూర్యాపేట జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటివరకు సహకరిస్తున్నాయని, రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఎస్ఐఆర్‌పై మరోసారి శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, అవసరమైన ధ్రువపత్రాలు లేని వారికి వాటిని పొందేందుకు సాధ్యమైనంత సహకారం అందిస్తామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే జిల్లా కలెక్టర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు అవగాహన కల్పిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు వేణుమాధవ్ రావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లకు ధ్రువపత్రాలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి



సూర్యాపేట, సెప్టెంబర్ 9: సందేశం టైమ్స్ ప్రతినిధి: ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించాలో ముందుగానే తెలియజేస్తే విచారణ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని నల్గొండ జిల్లా ఎన్నికల ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఏ. శ్రీదేవసేన అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ కాని ఓటర్లు, ఓటరు జాబితాలో వివరాల్లో తేడాలు ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, విచారణ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీదేవసేన మాట్లాడుతూ ఓటరుకు నోటీసు ఎందుకు జారీ చేశారో, దానికి ప్రతిగా వారు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించాలో విచారణకు ముందే స్పష్టంగా తెలియజేస్తే, విచారణ రోజున అవసరమైన పత్రాలను వెంట తీసుకుని హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు బీఎల్ఏలు, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లాలని, తద్వారా నోటీసులు అందుకున్న ప్రతి ఓటరుకు సంబంధించిన సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం బీఎల్ఓలు నోటీసు అందుకున్న ఓటర్లు అడిగినప్పుడు వారికి అవసరమైన ధ్రువపత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేసే స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నోటీసులు జారీ చేయాల్సిన వారందరికీ తప్పనిసరిగా నోటీసులు అందజేయాలని, నోటీసులను అనవసరంగా తమ వద్ద ఉంచుకోరాదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవరావు, తహసీల్దార్ సాయి గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్

సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ కూలీలకు నిరంతరం పని కల్పించడంతో పాటు ప్రతి కూలీకి రోజుకు కనీసం రూ.300 ఉపాధి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఎంపీఓలు, వీబీజీ రాంజీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బంది, అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అలసత్వాన్ని ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీల సంఖ్యను తక్షణమే పెంచాలని, ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీలను సమీకరించి వారికి నిరంతరం పని కల్పించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద మంజూరైన ఇందిరమ్మ మరుగుదొడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు వాటికి సంబంధించిన చెల్లింపులను కూడా ఎలాంటి జాప్యం లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. డ్రెయిన్ ఎండ్ సోక్ పిట్లు, వీఓ/ఎస్‌హెచ్‌జీ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని దిశానిర్దేశం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించి, పనుల్లో అలసత్వం ప్రదర్శించిన 16 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. అలాగే వీబీజీ రాంజీ సిబ్బందిలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏపీఓ, ఒక కంప్యూటర్ ఆపరేటర్, ఒక ఈసీపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ డి. శిరీష, డీపీఓ యాదగిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల వ్యవహారశైలి హేయమైన చర్య: బొల్లం మల్లయ్య యాదవ్





సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ అసెంబ్లీలో ప్రతిపక్ష బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ కోదాడలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం కోదాడ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తీవ్రంగా విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనను ఖండించాల్సిన ముఖ్యమంత్రి పోలీసులను సమర్థించడం సరికాదని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే అసెంబ్లీలో ప్రధాన అంశాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై కూడా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు రాష్ట్రంలోని ప్రజా సమస్యలపై అసెంబ్లీలో సమగ్రంగా చర్చించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని మల్లయ్య యాదవ్ స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులను రెండు రోజుల్లోగా పూర్తిగా అందజేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పారదర్శకమైన, సమగ్ర ఓటరు జాబితా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసుల జారీ, అందజేత, విచారణల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ సంగీత, సంబంధిత ఈఆర్ఓలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 4,60,387 నోటీసులు రూపొందించగా, ఇప్పటివరకు 3,07,344 నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి రెండు రోజుల్లోగా పూర్తి చేస్తామని సీఈఓకు వివరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఏఈఆర్ఓలు ప్రతిరోజూ తమ పరిధిలోని సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించేలా బీఎల్ఓల ద్వారా వారికి తగిన అవగాహన, సహకారం అందించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల జారీని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, నోటీసులు అందుకున్న ఓటర్ల విచారణలను కూడా సకాలంలో నిర్వహించి పూర్తిచేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం జరగకుండా ఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌ను అవమానించే వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరం



వట్పల్లి, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు వస్తున్న అనుచిత వ్యాఖ్యలను వట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజనాల విశ్వాస్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్ వ్యక్తిగత గౌరవాన్ని, ముఖ్యంగా ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, ప్రభుత్వ విధానాలు, రాజకీయ నిర్ణయాలను విమర్శించడంలో తప్పులేదని, అయితే ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులను, ముఖ్యంగా తల్లిదండ్రులను రాజకీయ విమర్శల్లోకి తీసుకురావడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. ఇది రాజకీయ సంస్కారానికి విరుద్ధమని పేర్కొన్నారు. దళిత కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత స్థానానికి ఎదగడం కొందరికి ఎందుకు అసహనంగా మారుతోందని వజనాల విశ్వాస్ ప్రశ్నించారు. ఒక తల్లి తన బిడ్డను పెంచి ప్రజాసేవకు పంపితే, ఆ తల్లిని అవమానించే పరిస్థితి ఎందుకు రావాలని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ పదవి ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, అది శాసనసభకు, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ వ్యవస్థకు సంబంధించిన అత్యంత గౌరవప్రదమైన పదవని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి సభా రికార్డులు, వీడియోలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులను సిద్ధాంతాలు, విధానాల ఆధారంగా విమర్శించాలే తప్ప వారి కుటుంబ సభ్యులను, తల్లిదండ్రులను అవమానించడం రాజకీయ సంస్కారం కాదని వజనాల విశ్వాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాల్లో ఇలాంటి అనుచిత సంస్కృతికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండకూడదని ఆయన అన్నారు.




## సూర్యాపేట రైల్వే ఉద్యమానికి ఉపాధ్యాయ లోకం అండ

సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు రైలు మార్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట రైల్వే సాధన సమితి చేపట్టిన 'లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమం'కు ఉపాధ్యాయ వర్గాల నుంచి మద్దతు లభించింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వయంగా పోస్ట్‌కార్డు రాసి సూర్యాపేట ప్రజల చిరకాల రైల్వే ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు హైదరాబాద్ నుంచి నేరుగా రైలు మార్గం లేకపోవడం ప్రజలకు తీవ్ర లోటుగా ఉందన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, వ్యాపారం, వ్యవసాయ అవసరాల కోసం నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలకు రైలు సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. సూర్యాపేట ప్రజల రైల్వే ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక లక్ష మంది ప్రజలతో ప్రధానమంత్రికి పోస్ట్‌కార్డులు పంపించాలన్న రైల్వే సాధన సమితి నిర్ణయం వినూత్నమైన ప్రజాస్వామ్య ఉద్యమమని అభినందించారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాన్ని సాధించేందుకు ఉద్యమాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. సూర్యాపేట రైల్వే సాధన ఉద్యమం ఏ ఒక్క సంఘానికో, వ్యక్తికో పరిమితం కాకుండా జిల్లా ప్రజల సమష్టి ఆకాంక్షగా మారాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, కార్మికులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒక్కొక్కరి చేతిలోని చిన్న పోస్ట్‌కార్డు లక్ష గొంతుకలుగా మారి ఢిల్లీకి సూర్యాపేట ప్రజల ఆకాంక్షను వినిపించగలదని, ప్రజల నుంచి విస్తృత స్పందన లభిస్తే హైదరాబాద్–సూర్యాపేట రైల్వే మార్గం అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత బలంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్–సూర్యాపేట రైల్వే మార్గం సాధన కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య పోరాటానికి తన మద్దతు కొనసాగుతుందని తీకుళ్ల సాయిరెడ్డి స్పష్టం చేశారు.



## పోసానిపెట్‌లో పారం పాడు పనులు ముమ్మరం

పోసానిపెట్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: అందోల్ మండలం పోసానిపెట్ గ్రామంలో పారం పాడు వీజీఎస్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వీజీఎస్ పనుల్లో భాగంగా భూగర్భ జలాల నిల్వ, పెంపునకు అనుకూలంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా గుంతల తవ్వకం చేపట్టారు. వీజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. నగేష్ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి పనులు చేపట్టారు. వర్షాకాలంలో కురిసే నీరు వృథాగా వెళ్లిపోకుండా గుంతల్లోకి చేరి భూమిలోకి ఇంకేలా ఈ పనులు చేపడుతున్నామని, తద్వారా భూగర్భ జలమట్టం పెరిగేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులను సమర్థవంతంగా చేపడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. నగేష్‌ను గ్రామస్తులు అభినందించారు.



## మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యాలను ఖండిస్తూ నిరసన ర్యాలీ

అందోల్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: బీఆర్ఎస్ పార్టీ మహిళా శాసన సభ్యులపై జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసుల దౌర్జన్యాలను నిరసిస్తూ అందోల్ నియోజకవర్గంలోని జోగిపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, ఇటీవల బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమని ఆరోపించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానాన్ని తెలంగాణ సమాజం, మహిళా లోకం తీవ్రంగా ఖండిస్తున్నాయని, బాధిత మహిళా ప్రజాప్రతినిధులకు బీఆర్ఎస్ శ్రేణులు అండగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి. జైపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పి. నారాయణ ముదిరాజ్, డి.బి. నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు పట్లూరి శివశేఖర్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, బి. వీరప్ప, శివకుమార్, మాచర్ల విజయ్‌కుమార్, రవి, సుంకే రమేష్, శేషుకుమార్, బిర్ల శంకర్, పల్లె వెంకట రమణ, కరుణాకర్, పరిపూర్ణం, సంతోష్, మొగులయ్య, రాంసాన్‌పల్లి మాజీ సర్పంచ్ ఆగమయ్య, నరసింహారెడ్డి, రాయిని బసవరాజ్, పాల్వంచ హనుమంతు, సంగెం కిష్టయ్య, ఎనగండ్ల సత్యనారాయణ, పట్నం మొగులయ్య, సటికే రాజు తదితరులతో పాటు భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




## మధిరలో కమల్ రాజు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

మధిర, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మధిర పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అరెస్టు, అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడిని నిరసిస్తూ మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మధిర పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల తరఫున ప్రశ్నించే హక్కును కాలరాస్తూ అరెస్టులు, దాడులకు పాల్పడటం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. మహిళా శాసనసభ్యులపై దాడి చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని అవమానించిందని ఆరోపించారు. మహిళలపై చేయి చేసుకునే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటని, దీనికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా సమస్యలను పక్కన పెట్టి పాలన సాగిస్తోందని ఆరోపించిన ఆయన, ప్రజల గొంతుకలను అణచివేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను దాచిపెట్టలేరని అన్నారు. తాత మధు అరెస్టును వెంటనే ఉపసంహరించుకోవాలని, మహిళా శాసనసభ్యులపై దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మధిరలో నిర్వహించిన నిరసన ర్యాలీతో ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత స్పష్టమైందని కమల్ రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ వివిధ మండలాల మాజీ అధ్యక్షులు, మాజీ కార్యదర్శులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి




మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలను ముందస్తుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండపాల వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయడం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాట్లు సులభతరం అవుతాయని తెలిపారు. ఆన్‌లైన్ సమాచారం నమోదుకు ఎలాంటి రుసుము లేదని పేర్కొంటూ, నిర్వాహకులు కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా పోలీసు శాఖ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, దరఖాస్తును సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అందించాలని సూచించారు. మండపాల ఏర్పాటులో ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక పరికరాలు, నీటి డ్రమ్ములు, ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మండపాలు, శోభాయాత్రల్లో డీజేలు, టపాసుల వినియోగానికి దూరంగా ఉండాలని, ఇతరుల మనోభావాలను కించపరిచేలా నినాదాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు కోరారు.



## మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలి

మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి, సహజ రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించే గోడపత్రికలను అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్‌ఓ అంబదాస్ రాజేశ్వర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మాధురి, హౌసింగ్ పీడీ మాణిక్యం, మెప్మా పీడీ హనుమంత్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ), రసాయన రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి కాలుష్యం పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని పేర్కొంటూ, ప్రజలు పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి వనరులు, ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, సహజంగా మట్టిలో కలిసిపోయే విగ్రహాలను వినియోగించడం ద్వారా పండుగను పర్యావరణహితంగా నిర్వహించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ రామచంద్రరాజు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్-2026 గడువు పొడిగింపు

మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026) షెడ్యూల్‌ను సవరించినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పు తదితరాలకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు తప్పనిసరిగా విచారణకు హాజరై తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 7 వరకు, నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి నవంబర్ 5 వరకు కొనసాగనుండగా, తుది ఓటరు జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్‌ఓలు), సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో సవరించిన షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు.




## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి

సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ విద్యుత్ అంతరాయం, మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీల కారణంగా అప్పుడప్పుడు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, భవిష్యత్‌లో నీటి సమస్య తలెత్తకుండా గతంలో వినియోగంలో ఉన్న దోసపహాడ్ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 9 నుంచి 10 నీటి ట్యాంకులను నింపి పట్టణంలోని వివిధ వార్డులకు నీటిని సరఫరా చేస్తున్నామని, సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో బోర్లు ఎండిపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని, మూసీ అధికారులతో మాట్లాడి సద్దుల చెరువును నింపినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండీ షఫీ ఉల్లా నీటి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణు జాతీయ రహదారి-65 కింద ఉన్న 60 అడుగుల రోడ్డు నుంచి కలెక్టరేట్‌కు అనుసంధాన రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున నీటి సమస్యపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరగా, ప్రజాప్రతినిధుల ఫోన్‌లకు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా స్పందించాలని కమిషనర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు 120 మంది పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగేళ్ల తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ప్రతి సంవత్సరం కార్మికులకు అందించే సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె తదితర సంక్షేమ సామగ్రిని అందించేందుకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌కు జనరల్ బాడీ ఆమోదం తెలిపింది. 60 అడుగుల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు రహదారి అనుసంధానానికి సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందించాలని నిర్ణయించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, మౌలిక వసతులకు సంబంధించిన అన్ని అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఈఈ కిరణ్, పబ్లిక్ హెల్త్ డీఈలు రమాదేవి, అనిల్, ప్రణయ్‌రెడ్డి, మేనేజర్ బుచ్చిబాబు, ఆర్వో జ్ఞానేశ్వరి, గౌస్, ప్రసాద్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 11 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు బాలిక

మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: పదకొండేళ్ల క్రితం ఇంటి నుంచి తప్పిపోయిన మానసిక వైకల్యం ఉన్న బాలికకు ఆధార్ నమోదు ద్వారా తల్లిదండ్రుల ఆచూకీ గుర్తించి వారి చెంతకు చేర్చినట్లు మెదక్ జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలానికి చెందిన దంపతుల కుమార్తె సుమారు 11 ఏళ్ల క్రితం తప్పిపోయి మెదక్ జిల్లాలోని బేతాని సంరక్షణ ఆశ్రమంలో అప్పటి నుంచి ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపారు. బాలికకు ఆధార్ కార్డు లేకపోవడంతో గతంలో పలుమార్లు నమోదు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమైందని, అనంతరం మాదాపూర్‌లోని ఆధార్ కేంద్రంలో నమోదు ప్రక్రియ చేపట్టగా ఆధార్ సంఖ్య లభించిందని వివరించారు. ఆధార్ వివరాల ఆధారంగా బాలిక తల్లిదండ్రుల ఆచూకీని గుర్తించి వారిని పిలిపించి బాలికను వారికి అప్పగించినట్లు తెలిపారు. పదకొండేళ్ల తర్వాత తమ కుమార్తె తిరిగి తమ చెంతకు చేరడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారని హేమ భార్గవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్, సరిత, మంజుల, బేతాని ఆశ్రమ సోషల్ వర్కర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతి




మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: విధి నిర్వహణకు వెళ్లిన మెదక్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ క్యూఆర్టీలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఆనందం (54) ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం చెక్‌పోస్ట్ విధుల నిమిత్తం తూప్రాన్‌కు వెళ్లిన ఆనందం అక్కడికి చేరుకోగానే ఛాతినొప్పితో అస్వస్థతకు గురై తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యులు ఈసీజీ నిర్వహిస్తున్న సమయంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ఆస్పత్రి సిబ్బంది వెంటనే సీపీఆర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి ఆనందం మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అందరితో కలిసిమెలిసి, సరదాగా ఉంటూ సహచరులతో ఆత్మీయంగా మెలిగే ఆనందం మృతిచెందిన విషయం తెలుసుకున్న తోటి సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విధుల్లో చురుగ్గా ఉండటంతో పాటు సహచరులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మంచి పేరు సంపాదించుకున్నారని సిబ్బంది గుర్తుచేసుకున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. హెడ్ కానిస్టేబుల్ ఆనందం మృతిపట్ల మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, పోలీసు శాఖకు ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆనందం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆనందం అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.



## జేఎల్ఐబీ కిట్స్ వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ

సంగారెడ్డి, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో ఎంపికైన 35 పాఠశాలల ఉపాధ్యాయులకు జేఎల్ఐబీ (JLIB) కిట్స్ వినియోగంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారిణి రోహిణి తెలిపారు. జిల్లా సైన్స్ కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన ప్రతి పాఠశాల నుంచి భౌతిక శాస్త్రం, జీవశాస్త్ర ఉపాధ్యాయులు తప్పనిసరిగా శిక్షణకు హాజరై జేఎల్ఐబీ కిట్స్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని, శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారిణి సూచించారు.




## విద్యార్థులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ధర్నా

అందోల్-జోగిపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: నర్సింగ్ జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సింగ్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మద్దతు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలిగిస్తున్న జీవో 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి వారి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల సమస్య పరిష్కారమయ్యే వరకు వారి పక్షాన నిలిచి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తెలిపారు.



## 479 మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన

మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఏబీసీ 3.0 అవగాహన, ప్రవర్తనా మార్పు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు లైఫ్ స్కిల్స్ ట్రైనర్, ఏబీసీ 3.0 ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత రాకేష్ కొర్రపాటి తెలిపారు. మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలంలోని బూర్గుపల్లి, కూచినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సుమారు 479 మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సునీత రాకేష్ కొర్రపాటి మాట్లాడుతూ "అవగాహనతో ఆలోచన మారాలి.. ఆలోచనతో ప్రవర్తన మారాలి.. ప్రవర్తనతో భవిష్యత్తు మారాలి" అనే లక్ష్యంతో ఏబీసీ 3.0 కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేవలం సమాచారం అందించడం కాకుండా జీవన నైపుణ్యాల ద్వారా సానుకూల ప్రవర్తనా మార్పును తీసుకురావడంపై దృష్టి సారిస్తున్నామని వివరించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యకరమైన ప్రవర్తనా మార్పు, తమను తాము తెలుసుకోవడం, తమ బలాలు-బలహీనతలను గుర్తించడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవడం వంటి అంశాలపై పరస్పర చర్చా పద్ధతిలో అవగాహన కల్పించారు. పిల్లల రక్షణకు సంబంధించిన చైల్డ్ హెల్ప్‌లైన్ 1098తో పాటు అందుబాటులో ఉన్న సహాయ సేవలపై కూడా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, మధుమోహన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సంకల్ప్ హబ్ ప్రతినిధి నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి అవసరాలకు గోదావరి, సాగర్ జలాలకు ప్రాధాన్యత



ఖమ్మం, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గోదావరి, సాగర్ జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా వినియోగించాలని, జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాలువ లింక్ కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగర్ జలాల ప్రవాహాన్ని, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీరు చేరే కాలువ, తూము మరమ్మతు పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాలువ ప్రస్తుత పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీరు సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన పరిస్థితులపై ఆరా తీసిన కలెక్టర్, కాలువ, తూము పునరుద్ధరణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి త్రాగునీటి ఎద్దడి రాకుండా సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండల పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కూడా సమీక్షించి, నోటీసులు అందుకున్న ఓటర్లలో ఒక్కరూ విచారణకు హాజరుకాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద నీటి పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ అధికారులు, ఇంజినీర్లతో కలిసి ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి అందుబాటులో ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ జిల్లాలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి అవసరం అధికంగా ఉన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలని కలెక్టర్ కోరారు. ఈ పర్యటనలో ఇరిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్‌రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్‌తో పాటు మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనిచేస్తోందని డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ తెలిపారు. మంగళవారం రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఆయన ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, వైద్య సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వివిధ వైద్య నిపుణుల సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివదయాల్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ గణేశ్వర్ ప్రతిరోజూ జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను సందర్శిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే రామాయంపేట సీహెచ్‌సీని పరిశీలించినట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్య నిపుణులు వృత్తిపట్ల క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, వివిధ వ్యాధులకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎవరైనా తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాధి పరిస్థితికి అనుగుణంగా వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ధాన్యం నిల్వ గోదాములకు స్థల పరిశీలన చేయాలి

మెదక్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: వానాకాలం ధాన్యం సీజన్-2026ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం నిల్వకు అవసరమైన గోదాముల నిర్మాణాల కోసం అనువైన స్థలాలను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు తదితర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి పరిశీలించాలని సూచించారు. గోదాముల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు, రైతులకు సులభంగా అందుబాటులో ఉండే పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని స్థలాల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 1వ తేదీ నాటికి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలను పూర్తి చేసి సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ సంచులు, ధాన్యం నాణ్యతను పరీక్షించే పరికరాలు తదితరాలను ముందుగానే సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కొనుగోలు, నిల్వ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం రైతులకు మద్దతు ధర అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌చార్జి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, పౌర సరఫరాల అధికారులు నిత్యానంద, జగదీష్, డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీసీఓ పద్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతు ప్రభుత్వం అంటే కాంగ్రెస్ ప్రభుత్వమే



అందోల్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రైతు ప్రభుత్వమని జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి అన్నారు. అందోల్ మండలం జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.1.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 15 నూతన షాపులకు మంగళవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయంలో నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు రూ.1.75 కోట్లతో 15 నూతన షాపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. మార్కెట్ యార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనులను పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించినట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మక్త జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ అడుగుజాడల్లో నడుస్తూ రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి అవకాశం కల్పించిన మంత్రి దామోదర రాజనర్సింహకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా లక్ష బిల్వార్చన





రాయికోడ్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాయికోడ్ మండల కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మంగళవారం లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. న్యామాతబాద్ గ్రామానికి చెందిన బిరాదర్ అన్నపూర్ణ–అప్పారావు పాటిల్ దంపతులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించిన అనంతరం లక్ష బిల్వదళాలతో స్వామివారికి బిల్వార్చన చేపట్టారు. దీంతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయంలో సందడి నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ రికార్డు అసిస్టెంట్ ఇందూర్ కృష్ణ, అర్చకులు టేకూర్ వీరుస్వామి, మఠం విజయ్‌కుమార్ స్వామి, జుట్టు బస్వరాజ్ స్వామి, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.




# కనీస వేతనాల సలహా మండలి నుంచి సీఐటీయూను తొలగించడం దుర్మార్గం

వట్టిపల్లి, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటీయూను కేంద్ర ప్రభుత్వ కనీస వేతనాల సలహా మండలి నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అని సిఐటీయూ వట్టిపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ ఎర్రోళ్ల మహేష్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వట్టిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు, కనీస వేతనాలు, సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని, అలాంటి సంఘాన్ని కనీస వేతనాల సలహా మండలి నుంచి తొలగించడం కార్మికుల హక్కులను అణచివేసే ప్రయత్నమేనని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షులు బి. జనార్ధన్, గోరెకల్ వట్టిపల్లి మండల అంబేద్కర్ యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి గొర్రెకల్ దాస్, రాదయ్య, సత్యనారాయణ గౌడ్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి




రాయికోడ్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాయికోడ్ ఎస్ఐ, జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ మండపాల నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న మండపాల నిర్వాహకులతో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల ఏర్పాటు, శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని, లౌడ్‌స్పీకర్లు, ధ్వని పరికరాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. మత, కుల, రాజకీయ భావాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, పాటలు లేదా ఇతర కార్యక్రమాలను నిర్వహించరాదని తెలిపారు. మండపాల వద్ద అగ్నిమాపక, విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, రాకపోకలకు అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. నిమజ్జన శోభాయాత్రలు పోలీసు అధికారులు సూచించిన మార్గాల్లోనే నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు లేదా అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా ప్రతి గణేష్ మండపం నిర్వాహకులు తమ మండపానికి సంబంధించిన వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్వాహకుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా పోలీస్ పోర్టల్‌లో మండప వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోలీసు శాఖ సూచించిన నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహిస్తామని మండపాల నిర్వాహకులు హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు డైవర్షన్ డ్రామాలు



అందోల్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని జోగిపేట మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.బి. నాగభూషణం ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీరపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హోంశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై నిర్బంధాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. అసెంబ్లీని ఏకపక్షంగా నడుపుతూ ప్రతిపక్షం ప్రజా సమస్యలను ప్రశ్నిస్తుందనే భయంతో వారిని అడ్డుకుంటున్నారని, ఎమ్మెల్యేలపై దాడులు జరుగుతున్నాయని, మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడంపైనే దృష్టి పెట్టిందని ఆరోపించారు. దేశంలోనే ప్రత్యేకంగా నిలిచిన దళిత బంధు వంటి సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని కొనసాగించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కేసీఆర్‌ను విమర్శిస్తున్న పలువురు నాయకులు గతంలో దళిత బంధు పథకాన్ని వ్యతిరేకించిన వారేనని అన్నారు. ప్రతిపక్ష నేతపై దాడికి ప్రయత్నించడం దేశ రాజకీయాల్లో అత్యంత నీచమైన చర్యగా అభివర్ణించిన నాగభూషణం, పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని, కేటీఆర్, హరీశ్‌రావులను సైతం అక్రమంగా అరెస్టు చేసి అడుగడుగునా నిర్బంధాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు ఎలాంటి హాని జరిగినా బీఆర్ఎస్ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని కుట్రలు, నిర్బంధాలు జరిగినా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని డి.బి. నాగభూషణం తెలిపారు.



# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కలెక్టర్, సీపీ మర్యాదపూర్వక భేటీ

ఖమ్మం, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఎన్ఎస్‌పీ అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని పుష్ప మొక్కను అందించి స్వాగతించారు. కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన అంశాలు, జిల్లా పరిస్థితులపై అధికారులు మర్యాదపూర్వకంగా చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఉత్సవాల భద్రతకు పోలీసులకు సహకరించండి ఎస్సై కోటేశ్వరరావు

మానూర్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని మానూర్ ఎస్సై కోటేశ్వరరావు కోరారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులతో ఎస్సై కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం నిర్వాహకుడు పోలీస్ శాఖ సూచించిన policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో గణేష్ విగ్రహం, మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల ప్రతిని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని కోరారు. మండపాల వివరాలను ముందుగానే పోలీసులకు అందజేయడం ద్వారా ఉత్సవాల సమయంలో అవసరమైన భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు, భక్తులు ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకునేలా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, పోలీస్ శాఖ సూచించే నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై కోటేశ్వరరావు సూచించారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంతురి గోపాల్ జన్మదిన వేడుకలు ఘనంగా



వట్టిపల్లి, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండల పరిధిలోని మర్వేల్లి గ్రామానికి చెందిన మంతురి గోపాల్ జన్మదిన వేడుకలను మంగళవారం అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మంతురి గోపాల్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు, యువకులు, స్నేహితులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# మండపాల వివరాలు సకాలంలో నమోదు చేయండి: సీఐ హనుమంతు

హద్నూర్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు కోరారు. హద్నూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ గ్రామాలకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులతో ఎస్సై దోమ సుజిత్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ హనుమంతు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా తమ మండపాలకు సంబంధించిన పూర్తి వివరాలను policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహం, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలతో పాటు అవసరమైన సమాచారాన్ని సక్రమంగా నమోదు చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల జిరాక్స్ ప్రతిని హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని కోరారు. నిర్వాహకులు సకాలంలో పూర్తి వివరాలను పోలీసులకు అందజేస్తే మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు నిర్వాహకులు సహకరించాలని సీఐ హనుమంతు కోరారు.



# ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

సూర్యాపేట, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా నూతన కమిటీని రాష్ట్ర నాయకుడు మండవ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ధారావత్ చత్రు నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఉడుం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చంద్రకళ, సురేష్, గురుప్రసాద్, మధు, సహాయ కార్యదర్శులుగా సుజాత, రాధ, నరసింహారావు, కృష్ణకుమార్, కోశాధికారిగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండవ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా నూతన కమిటీ కృషి చేయాలని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు సమష్టిగా పనిచేస్తూ ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఉద్యోగులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## ఓపెన్-చెస్ట్ సర్జరీ లేకుండా ఛాతీ అయోర్టా సమస్యకు అధునాతన చికిత్స



హైదరాబాద్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఛాతీ భాగంలోని అయోర్టా (మహాధమని)లో తీవ్రమైన సమస్యలతో బాధపడుతున్న ఎంపిక చేసిన రోగులకు ఓపెన్-చెస్ట్ సర్జరీకి ప్రత్యామ్నాయంగా తక్కువ కోతతో నిర్వహించే థొరాసిక్ ఎండోవాస్క్యులర్ అయోర్టిక్ రిపేర్ (టీఈవీఏఆర్) విధానంతో చికిత్స అందిస్తున్నట్లు సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. ఓపెన్ శస్త్రచికిత్సలో అధిక ప్రమాదం ఉండే లేదా శస్త్రచికిత్సకు తగిన పరిస్థితుల్లో లేని కొంతమంది రోగులకు ఈ కనిష్ఠ జోక్య విధానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సాధారణ ఓపెన్ అయోర్టిక్ శస్త్రచికిత్సకు భిన్నంగా టీఈవీఏఆర్ విధానంలో సాధారణంగా తొడ లేదా గజ్జ ప్రాంతంలోని రక్తనాళం ద్వారా సన్నని క్యాథెటర్‌ను ప్రవేశపెట్టి, దాని సహాయంతో ప్రత్యేక స్టెంట్-గ్రాఫ్ట్‌ను ఛాతీ భాగంలోని అయోర్టాలో వ్యాధి ఉన్న ప్రాంతానికి చేర్చి అక్కడ విస్తరింపజేస్తారు. ఈ స్టెంట్-గ్రాఫ్ట్ దెబ్బతిన్న అయోర్టా భాగాన్ని లోపల నుంచి సీల్ చేయడం ద్వారా రక్తప్రవాహాన్ని సురక్షితమైన మార్గంలో కొనసాగించేందుకు సహాయపడుతుందని వైద్యులు వివరించారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అసోసియేట్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ సరైన రోగుల్లో ఛాతీ అయోర్టా వ్యాధుల చికిత్సలో టీఈవీఆర్ ఒక ముఖ్యమైన ఆధునిక విధానమని తెలిపారు. రోగి వయస్సు, మొత్తం ఆరోగ్య పరిస్థితి, అయోర్టా వ్యాధి స్వభావం, వ్యాధి ఉన్న ప్రాంతం, అధునాతన సీటీ యాంజియోగ్రఫీ వంటి పరీక్షల ద్వారా లభించే వివరాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఓపెన్ సర్జరీకి బదులుగా టీఈవీఆర్ సరైనదా కాదా నిర్ణయిస్తామని చెప్పారు. తగిన రోగుల్లో పెద్ద శస్త్రచికిత్సను నివారించడం, కోలుకునే సమయాన్ని తగ్గించడం, చికిత్స ఫలితాలను మెరుగుపరచడం లక్ష్యంగా వైద్య విధానాన్ని ఎంపిక చేస్తామని వివరించారు. టీఈవీఆర్ వంటి చికిత్సలకు అధునాతన ఇమేజింగ్ సదుపాయాలతో పాటు ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు, వాస్క్యులర్ లేదా కార్డియాక్ సర్జన్లు, అనస్థీషియా నిపుణులు, ఇతర సంబంధిత విభాగాల వైద్యులతో కూడిన సమన్వయ బృందం అవసరమని తెలిపారు. ప్రతి రోగికి టీఈవీఆర్ సరైన చికిత్స కాదని, అయోర్టా నిర్మాణం, వ్యాధి ఉన్న ప్రదేశం, ఇతర ఆరోగ్య సమస్యలు, శస్త్రచికిత్స ప్రమాదాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నిపుణుల బృందం తగిన చికిత్సా విధానాన్ని నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. మూడు దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్న యశోద గ్రూప్ హైదరాబాద్‌లో సోమాజిగూడ, సికింద్రాబాద్, మలక్‌పేట్, హైటెక్ సిటీలలో నాలుగు ఆసుపత్రుల ద్వారా వివిధ వైద్య విభాగాల్లో అధునాతన రోగనిర్ధారణ, చికిత్సా సేవలను అందిస్తోంది.



# రైతు ఉద్యమానికి సారంపల్లి మల్లారెడ్డి జీవితం అంకితం

హైదరాబాద్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఆరు దశాబ్దాలపాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి జాతీయ స్థాయి వరకు రైతులు, రైతు కూలీలు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతు ఉద్యమానికి సారంపల్లి మల్లారెడ్డి తన జీవితాన్ని అంకితం చేశారని, రైతులు, రైతు కూలీలు, కౌలు రైతుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సభలో పలువురు నాయకులు ప్రస్తావించిన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావిస్తూ, కమ్యూనిస్టు యోధుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టిన విధంగానే సారంపల్లి మల్లారెడ్డి సేవలు భవిష్యత్ తరాలకు గుర్తుండిపోయేలా తగిన కార్యక్రమం చేపట్టేందుకు మంత్రివర్గంలో చర్చిస్తామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం కోసం సారంపల్లి మల్లారెడ్డి చేసిన కృషి, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్రను ఈ సందర్భంగా పలువురు నేతలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, పలువురు ఎమ్మెల్యేలు, సీపీఎం నాయకులు ప్రకాశ్ కారత్, జాన్ వెస్లీతో పాటు పలువురు ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.




# హామీలు అమలు చేయాలి.. ప్రజలకు సమాధానం చెప్పాలి

నడిగూడెం, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సూచనలతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతూ నడిగూడెం ఎంపీడీవోకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల సమన్వయ సమితి కమిటీ సభ్యులు అనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం మాత్రమే కాకుండా, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయినప్పటికీ అనేక హామీల అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను విస్మరించకూడదన్నారు. హామీలు పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సమన్వయ సమితి కమిటీ సభ్యులు గార్లపాటి శ్రీనివాసరెడ్డి, నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్, పోలంపల్లి వెంకటేశ్వర్లు, యలగొండ నాగేశ్వరరావు, నీలకంఠ వెంకన్న, వార్డు సభ్యులు దున్న మనిషా ప్రదీప్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్కే జలీల్, చిత్తలూరి రవి, రాజుల కృష్ణమూర్తి, దోసపాటి సతీష్, రెడ్డిపల్లి శ్రీను, విజయ్, కృష్ణయ్య తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

# మరవెల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



వట్పల్లి, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, సమాజ అభివృద్ధి మరియు నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## తుక్కుగూడ నర్సు హత్యాచార ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు సీఎం ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 9: సందేశం టైమ్స్ ప్రతినిధి: హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించి, ఘటనపై మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏమైనా నిర్లక్ష్యం జరిగిందా, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అనే అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేసులో నిందితుడిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వేగంగా పూర్తిచేసి సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించాలని, న్యాయశాఖ, పోలీసుశాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం తరఫున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు ఆర్థిక సహాయం అందించారని, ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన సీఎం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.




## విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఉపాధ్యాయుల బాధ్యత: సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబర్ 9: సందేశం టైమ్స్ ప్రతినిధి: పిల్లలపై ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని, వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఉపాధ్యాయుల బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న 175 మంది ఉపాధ్యాయులకు ఆయన అభినందనలు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో పాటు వారిలోని నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు రూపకల్పనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఉత్తమ సేవలు అందించి రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న 175 మంది ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌పై రూ.21.01 కోట్ల జరిమానా: పవన్ కళ్యాణ్ సీరియస్




రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 8: – సందేశం టైమ్స్ ప్రతినిధి: రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తూ పన్నులు చెల్లించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్న అంశంపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సీరియస్‌గా స్పందించారు. ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆంధ్రా పేపర్ లిమిటెడ్‌కు రూ.21.01 కోట్ల జరిమానా విధించినట్లు వెల్లడైంది. పరిశ్రమల కార్యకలాపాల కారణంగా పర్యావరణానికి నష్టం కలగకుండా కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేసినట్లు సమాచారం.



## వికసిత్ భారత్@2047 కోసం ఆరోగ్య రంగాన్ని పునఃఆవిష్కరించాలి: అశోక్ కుమార్ లాహిరి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: సందేశం టైమ్స్ ప్రతినిధి: వికసిత్ భారత్@2047 లక్ష్య సాధనలో భాగంగా దేశ ఆరోగ్య రంగాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ లాహిరి అన్నారు. న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ ప్రసంగ కార్యక్రమంలో 'వికసిత్ భారత్@2047 కోసం ఆరోగ్య సంరక్షణను పునఃఆవిష్కరించడం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దేశంలో ఆరోగ్య రంగం గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్న ఆయన, ఇకపై మరణాల సంఖ్యను తగ్గించడంపైనే కాకుండా వ్యాధుల భారాన్ని తగ్గించడంపై కూడా ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, నాణ్యమైన వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. దేశంలో చోటుచేసుకుంటున్న వ్యాధుల స్వభావం, జనాభా నిర్మాణం, పోషకాహార మార్పులకు అనుగుణంగా ఆరోగ్య విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య సేవలను బలోపేతం చేయడంతో పాటు డిజిటల్ ఆరోగ్య సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఆరోగ్య సిబ్బందిని అభివృద్ధి చేయాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ వంటి వైద్య విద్య, పరిశోధనా సంస్థలు మార్పుకు కేంద్రాలుగా పనిచేయాలని, భారతీయ పరిస్థితులకు అనుగుణమైన ఆధారాలను రూపొందించడం, పరిశోధన–ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడం, భవిష్యత్ అవసరాలకు సిద్ధమైన ఆరోగ్య నిపుణులను తయారు చేయడం, పరిశోధన ఆధారాలను ఆరోగ్య కార్యక్రమాలు, విధానాల్లోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని అశోక్ కుమార్ లాహిరి పేర్కొన్నారు.



## వైభవంగా తిరుమలలో ఉట్లోత్సవం

తిరుమల, సెప్టెంబర్ 9: సందేశం టైమ్స్ ప్రతినిధి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా తిరుమలలో ఉట్లోత్సవం (శిక్యోత్సవం) శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గోకులాష్టమి ఆస్థానం నిర్వహించిన మరుసటి రోజు ఉట్లోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శ్రీ మలయప్పస్వామివారు బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామివారు మరో తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఉట్లోత్సవాన్ని తిలకించారు. ముందుగా శ్రీ మలయప్పస్వామివారు ఊరేగింపుగా శ్రీ పెద్దజీయర్ మఠానికి వేంచేపు చేసి అక్కడ ఆస్థానం చేపట్టారు. అనంతరం శ్రీవారి ఆలయం ఎదుట ఉట్లోత్సవం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో కోలాహలంగా సాగిన ఉట్లోత్సవంలో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, శ్రీవారి ఆలయ ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ జాతరలో భక్తుల అవస్థలు.. మంచినీటి కోసం ఎదురుచూపులు



హుజూర్‌నగర్, సెప్టెంబర్ 9 : సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరుగుతున్న ముత్యాలమ్మ జాతర సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోనాలతో తరలివచ్చిన మహిళలు, చిన్నారులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తుండటంతో అలసటకు గురవుతున్నారు. ఎక్కువసేపు క్యూలో నిలబడటంతో పలువురు మహిళా భక్తులు స్పృహ తప్పి పడిపోతున్న పరిస్థితి నెలకొన్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎండ, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, క్యూలైన్ల వద్ద కనీసం మంచినీటి సదుపాయం కూడా అందుబాటులో లేకపోవడంతో దాహంతో అవస్థలు పడుతున్నామని భక్తులు తెలిపారు. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో క్యూలైన్ల వద్ద తాగునీరు, అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీని భక్తులు కోరుతున్నారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు తక్షణమే స్పందించి తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## ట్రంప్‌కు కెనడా భారీ షాక్.. అమెరికా వస్తువులపై భారీ సుంకాలు

అంతర్జాతీయం, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలకు ప్రతీకారంగా కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వందలాది రకాల వస్తువులపై 15 శాతం నుంచి 50 శాతం వరకు ప్రతీకార సుంకాలను సెప్టెంబర్ 8 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. కెనడా అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం సుమారు 27.6 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై ఈ సుంకాలు వర్తించనున్నాయి. ఉక్కు, పాల ఉత్పత్తులు, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, కాగితం, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాలకు చెందిన అమెరికా ఉత్పత్తులు ఈ జాబితాలో ఉన్నాయి. అమెరికా ప్రభుత్వం కెనడా ఉత్పత్తులపై విధించిన 50 శాతం వరకు సుంకాలకు ప్రతిస్పందనగానే ఈ చర్యలు చేపట్టినట్లు కెనడా ప్రభుత్వం వెల్లడించింది. రెండు దేశాల మధ్య వాణిజ్య చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కెనడా తీసుకున్న ప్రతీకార చర్యలతో అమెరికా కంపెనీలు, ఎగుమతిదారులపై ఆర్థిక ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు అమెరికా కూడా కెనడాపై మరిన్ని చర్యలకు సిద్ధమవుతుండటంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య వివాదం మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తోంది.



## నిరుద్యోగ యువతకు వైసీపీ అండ: జగన్

ఆంధ్రప్రదేశ్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: నిరుద్యోగ యువతపై కేసులు నమోదు చేయడాన్ని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కాకినాడలో పోలీస్ ఉద్యోగాల కోసం ఆందోళన నిర్వహించిన 20 మంది ఉద్యోగార్థులపై కేసులు నమోదు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించినందుకు నిరుద్యోగ యువతపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించిన జగన్, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా పోలీస్ నియామక ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఉద్యోగాల కోసం పోరాడుతున్న యువతకు న్యాయం జరిగే వరకు వైసీపీ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జగన్ స్పష్టం చేశారు.



## క్షమాపణ చెబుతారని భావించా.. డైవర్షన్ చేస్తున్నారు: స్పీకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ శాసనసభలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు క్షమాపణ చెబుతారని భావించానని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సభ ప్రజాస్వామ్యబద్ధంగా, సజావుగా కొనసాగాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. హరీశ్‌రావుకు సభలో మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన సమయంలో గతంలో జరిగిన ఘటనపై క్షమాపణ చెబుతారని తాను భావించానని, అయితే ఆయన అసలు అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని స్పీకర్ వ్యాఖ్యానించారు. సభలో జరిగిన పరిణామాల నేపథ్యంలో తాను ఆగ్రహానికి గురయ్యానని తెలిపారు. సభ గౌరవం, ప్రజాస్వామ్య విలువలు కాపాడుతూ సభ్యులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పీకర్ సూచించినట్లు సమాచారం.




## గుజరాత్, మహారాష్ట్రలో రూ.35 వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్, మహారాష్ట్రలో పర్యటించి రూ.35 వేల కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. గుజరాత్‌లోని వడోదరలో జరిగిన కార్యక్రమంలో రైల్వేలు, జాతీయ రహదారులు, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణం, తాగునీరు, పునరుత్పాదక ఇంధన రంగాలకు సంబంధించిన పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ముఖ్యంగా వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని మూడు కీలక విభాగాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. సనంద్–మకర్పురా, న్యూ ఉంబర్‌గావ్–న్యూ సఫాలే, న్యూ సఫాలే–జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ విభాగాలు కలిపి 326 రూట్ కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా, వీటి నిర్మాణానికి రూ.20,700 కోట్లకు పైగా వ్యయం అయింది. ఈ మార్గం ద్వారా సరుకు రవాణా వేగవంతం కావడంతో పాటు ప్రధాన ఓడరేవులు, పారిశ్రామిక ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత మెరుగుపడనుంది. అదేవిధంగా కొత్త సరుకు రైలు సేవలతో పాటు టాండా రోడ్–వడోదర మధ్య ప్రయాణికుల రైలు సేవను కూడా ప్రధాని ప్రారంభించారు. అలీరాజ్‌పూర్‌లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు జాతీయ రైల్వే వ్యవస్థతో మెరుగైన అనుసంధానం కల్పించడంలో ఈ సేవలు కీలకంగా మారనున్నాయి. రహదారి, రైల్వే, ఇంధన, నీటి సరఫరా తదితర రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి, సరుకు రవాణా సామర్థ్యం పెంపునకు, ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు దోహదపడతాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అనంతరం ప్రధాని మోదీ మహారాష్ట్రలో పర్యటించి ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్-2026లో పాల్గొన్నారు.



## స్పీకర్‌పై వ్యాఖ్యలకు తాతా మధు క్షమాపణ చెప్పాలి

ఖమ్మం, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ పాలేరు నియోజకవర్గ పరిధిలోని నేలకొండపల్లి, ఏదులాపురం, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం సమర్థనీయం కాదని, అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ నాయకుల అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని కించపరచడమేనని పేర్కొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో కాంగ్రెస్ నాయకులు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తాతా మధుపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉంటాయని, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని దిగజార్చే వ్యాఖ్యలను సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, అంతేకాక పార్టీ నాయకుడిగా కేసీఆర్ కూడా ఈ వ్యవహారంపై స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బాణోతు కిషోర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ భాష మన సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 9: – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని జరుపుకునే తెలంగాణ భాషా దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రత్యేకమైనదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల భాషలోనే ప్రజల సమస్యలు, ఆకాంక్షలను తన రచనల్లో ప్రతిబింబించిన కాళోజీ నారాయణరావు తన కలాన్ని సామాజిక చైతన్యానికి సాధనంగా మలిచారని, అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ భాష కేవలం మాట్లాడే తీరు మాత్రమే కాదని, అది తెలంగాణ సంస్కృతి, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ భాష, యాసలకు సాహిత్య గౌరవాన్ని తీసుకురావడంలో కాళోజీ నారాయణరావు పాత్ర ఎంతో విశిష్టమైనదని గుర్తుచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా వైభవాన్ని కాపాడుతూ భాష పట్ల గౌరవాన్ని మరింత పెంపొందించుకోవాలని, కాళోజీ ప్రజా చైతన్య స్ఫూర్తిని, ఆయన ఆలోచనా విధానాన్ని నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి సూచించారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.